సాక్షి నిజామాబాద్

బుధవారం । 20 । ఆగస్టు । 2025



జీరో విద్యుత్ ప్రమాదాలే..
జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) మధుసూదన్ సూచించారు.
- 8లో ▸



లక్ష్యం మేరకు ఆయిల్‌పామ్..
జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్‌పామ్ సాగు జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
25.7/22.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆయకట్టుకు ధోకా లేదు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు రెండు పంటలకు ధోకా లేదని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దేవాదాయ శాఖ మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈఈ చక్రపాణితో మాట్లాడి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో తదితర వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి బేసిన్‌లోని అన్ని ప్రాజెక్ట్‌లు నిండటం ఆనందకరమన్నారు. ఎస్సారెస్పీని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సామర్థ్యానికి మించి విద్యుదుత్పత్తి



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన ఉన్న జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌ల ద్వారా సామర్థ్యానికి మించి విద్యుదుత్పత్తి జరుగుతోంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద వచ్చి చేరడంతో నీటి నిల్వ పూర్తి స్థాయికి చేరువలో ఉంది. నీటి ప్రవాహం వేగంగా రావడంతో కేంద్రంలో సామర్థ్యానికి మించి విద్యుదుత్పత్తి జరుగుతోందని జెన్‌కో అధికారులు తెలిపారు. జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌లతో టర్బయిన్‌కు 9 మెగావాట్ల చొప్పున 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే సామర్థ్యం ఉంది. ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని మళ్లించి విద్యుదుత్పతి చేపడుతున్నారు. నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36.29 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 5.62 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్ తెలిపారు.

23, 25 తేదీల్లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

నిజామాబాద్ నాగారం: నగరంలో ఈనెల 23, 25 తేదీల్లో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రత్నాకర్ నరాల, రాజాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 23న అండర్ 14, 16 బాలబాలికలకు, 25న అండర్ 18, 20 బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారిని ఈనెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 21లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9989040776ను సంప్రదించాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌కు సమాజ సేవ శిక్ష

- వినూత్న శిక్ష విధించిన కామారెడ్డి కోర్ట్



కామారెడ్డి టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి సామాజిక సేవను శిక్షగా విధించింది కామారెడ్డి కోర్టు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కాడు. అతడిని పోలీసులు మంగళవారం కామారెడ్డి కోర్టులో హాజరు పరిచారు. సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ టి.చంద్రశేఖర్ నిందితుడికి వెయ్యి రూపాయల జరిమానాతో పాటు ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని శిక్ష విధించారు. 'నేను మద్యం సేవించి వాహనం నడిపినందుకు కోర్ట్ నాకు ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధించింది. మద్యం సేవించి వాహనం నడుపవద్దు' అనే ప్లకార్డును ప్రదర్శిస్తూ జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో నిల్చున్నాడు. ఇకపై మద్యం తాగి వాహనం నడపనని అతడు పేర్కొన్నాడు. ఈ వ్యక్తిని చూసైనా మద్యం తాగి వాహనాలు నడిపేవారిలో మార్పు వస్తుందేమో.

డబుల్ ఇళ్లపై కదలిక

- పంపిణీ చేసేందుకు అధికారుల నిర్ణయం
- అర్హుల ఎంపికపై కొనసాగుతున్న క్షేత్రస్థాయి విచారణ
- ప్రజాపాలన దరఖాస్తులే ప్రామాణికం?

నిజామాబాద్ అర్బన్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ ఇళ్ల కోసం అర్హులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో గెజిటెడ్ అధికారుల బృందాలతో విచారణ చేపడుతున్నారు. అధికారుల బృందాలు ఎంపిక చేసిన వారికి ఎల్-2(ఇల్లు, జాగాలేనివారు) కేటగిరి కింద ఇళ్లు పంపిణీ చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించినప్పటికీ ఎలక్షన్ కోడ్ కారణంగా నిలిచిపోయింది. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఇటీవలే జిల్లా కేంద్రంలోని నాగారంలో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ అధికారులు పరిశీలించారు.

వారికే ముందు..

డబుల్ ఇళ్ల పంపిణీ కోసం గత ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తులను పలు ఆరోపణల నేపథ్యంలో పక్కన పెట్టేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించింది. అయితే ఇల్లు, సొంత జాగా లేని వారిని అర్హులుగా ఎంపిక చేసే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా 9486 డబుల్ ఇళ్లు మంజూరు కాగా, 5695 పంపిణీ చేశారు. 1662 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. 2129 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్‌లో 396 ఇళ్ల పనులు పూర్తయి రెండేళ్లవుతోంది.

బాన్సువాడ ముందంజ

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో బాన్సువాడ నియోజకవర్గం(నిజామాబాద్ జిల్లా పరిధిలోని మండలాలు) ముందంజలో ఉంది. నియోజకవర్గానికి 4807 ఇళ్లు మంజూరు కాగా 4018 ఇళ్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం రెండు ఇళ్ల నిర్మాణాలు పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉండగా, మరో 787 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్‌లో ఇంత వరకు ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయలేదు. ఆర్మూర్ నియోజక వర్గంలో 92 , నిజామాబాద్ రూరల్ నియోజక వర్గంలో 98 , బాల్కొండ నియోజక వర్గంలో 925, బోధన్ నియోజకవర్గంలో 562 ఇళ్లు ఇప్పటి వరకు పంపిణీ చేశారు. ప్రస్తుతం 1662 ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేసే అవకాశం ఉంది.

నియోజకవర్గం	మంజూరైన ఇళ్లు	పంపిణీ చేసిన ఇళ్లు	పూర్తయి ఇళ్లు	నిర్మాణ దశలో..
నిజామాబాద్ అర్బన్	900	-	396	504
నిజామాబాద్ రూరల్	502	98	58	346
బాల్కొండ	1,176	925	251	-
బోధన్	1,553	562	615	376
బాన్సువాడ	4,807	4,018	02	787
ఆర్మూర్	548	92	340	116
మొత్తం	9,486	5,695	1,662	2,129

మరమ్మతులకు రూ.3కోట్లు

జిల్లాలోని వర్నితోపాటు పలు ప్రాంతాల్లో పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయనప్పటికీ అర్హులు బలవంతంగా వాటిలో ఉంటున్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లు సంవత్సరాల తరబడి అలాగే ఉండడంతో కిటికీలు, తలుపులు, కులాయిలు, పైపులను దుండగులు ఎత్తుకెళ్లారు. పలు చోట్ల ధ్వంసమయ్యాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. వాటి మరమ్మతులకు రూ.3 కోట్లు మంజూరు చేశారు. మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేసి ఇళ్లను బాగు చేయాలని అధికారులు ఆదేశించారు.

విచారణ కొనసాగుతోంది

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో భాగంగా ప్రస్తుతం క్షేత్రస్థాయిలో అర్హుల ఎంపికకు సంబంధించి విచారణ కొనసాగుతోంది. గెజిటెడ్ అధికారుల బృందాలను నియమించడం జరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విచారణ చేస్తున్నారు. అనంతరం అర్హులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయిస్తాం. – నివర్తి, హౌసింగ్ ఏఈ



జిల్లా కేంద్రంలోని నాగారం ప్రాంతంలో నిర్మాణాలు పూర్తి అయిన డబుల్‌బెడ్‌రూమ్‌లు

చివరి దశలో ఇందిరమ్మ ఇళ్ల పనులు



జైతాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- వివిధ దశల్లో తొలి విడత మంజూరైన ఇళ్లు
- పూర్తయిన వాటిని త్వరలో ప్రారంభిస్తాం
- నిర్మాణానికి ముందుకు రాని లబ్ధిదారుల స్థానంలో కొత్తవారి ఎంపిక
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

బోధన్: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు తొలి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులతో కలిసి పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఎడపల్లి మండలంలోని జైతాపూర్‌లో 15 ఇళ్లు పూర్తయ్యాయని, వాటిని వారం రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎడపల్లి మండలం జైతాపూర్, ఠాణాకలాన్ గ్రామాలను అడిషనల్ కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ మంగళవారం సందర్శించారు. జైతాపూర్‌లో 74 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని, పూర్తయిన 15 ఇళ్లకు సంబంధించి చిన్నచిన్న పనులను వెంటనే పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. బిల్లుల చెల్లింపులపై ఆరా తీయగా, చివరి విడతకు సంబంధించి రూ.లక్ష బిల్లు రావాల్సి ఉందని లబ్ధిదారులు తెలిపారు. వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇళ్లకు విద్యుత్ కనెక్షన్, మిషన్ భగీరథ నీటి సరఫరా సౌకర్యాలు కల్పించాలని విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎవరైనా ఇళ్ల నిర్మాణానికి ముందుకురాకపోతే వారి స్థానంలో అర్హులను గుర్తించాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఆడంబారాలకు పోయి అప్పు ఊబిలో కూరుకుపోవద్దన్నారు. అనంతరం రూర్బన్ పథకం కింద కొత్తగా నిర్మించిన పల్లె దవాఖానను సందర్శించారు. నూతన భవనంలో విద్యుత్ సౌకర్యం లేదని గుర్తించి, వెంటనే విద్యుత్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎరువుల కొరత లేదు

జిల్లాలో యూరియా, ఇతర ఎరువుల కొరత లేదని, రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ అన్నారు. ఠాణాకలాన్‌లోని సొసైటీ గోదామును సందర్శించి స్టాక్‌ను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ తరహాలోనే వచ్చే యాసంగి సీజన్‌లో సైతం కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల పంపిణీ జరిగేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలన్నారు. పట్టాపాస్ పుస్తకాలు లేని రైతులు పంటలు సాగు చేస్తే వారికి కూడా ఎరువులు ఇవ్వాలని ఆదేశించారు. ఆయనవెంట జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ పవన్‌కుమార్, మండల అధికారులు ఉన్నారు.

ఐదు మండలాల్లో అధిక వర్షం

- జిల్లా వ్యాప్తంగా 9.6 మి.మీటర్లు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని ఐదు మండలాల్లో మంగళవారం అధిక వర్షం కురిసింది. కురవాల్సిన దానితోపోలిస్తే డొంకేశ్వర్‌లో 11.8, నిజామాబాద్ రూరల్‌లో 10.3, ని.సౌత్‌లో 9.0, వర్నిలో 5.5, ఇందల్వాయిలో 0.8 మి.మీ, అధిక వర్షం కురిసింది. 18 మండలాల్లో సాధారణ, పది మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 9.6 మి.మీ. వర్షం కురవగా, ఏర్గట్లలో 19.1, మెండోరాలో 20.9, కమ్మర్‌పల్లిలో 16.0, బాల్కొండలో 13.2, నవీపేట–11.2 మి.మీ. వర్షం కురిసింది.

వీడీసీ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ సీజ్

- కమిటీ రద్దుకు సుర్బిర్యాల్ గ్రామస్తుల నిర్ణయం

నిజామాబాద్ లీగల్ : ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన సర్వజన సంఘం(వీడీసీ) ఆ మడిగెలను ఆధిపత్య కులాలకు చెందిన వారికి అప్పగించింది. దీంతో తమకు సైతం మడిగెలను అద్దెకు ఇవ్వాలని దళితులు అడగడంతో వారిపై సాంఘిక బహిష్కరణ వేటు వేసింది. ఈ చర్యతో జిల్లా న్యాయసేవా సంస్థను ఆశ్రయించిన దళితులు తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టిన జిల్లా న్యాయసేవా సంస్థ వీడీసీ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతులు ఉన్నాయా? లేదా? అనే దానిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆర్మూర్ తహసీల్దార్‌తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించింది. విచారణ చేపట్టిన అధికారులు నీటిపారుదల శాఖకు చెందిన స్థలాన్ని కబ్జా చేసి మడిగెలను నిర్మించినట్లు తేల్చారు. న్యాయసేవా సంస్థ ఆదేశాలతో కదలిక వచ్చిన అధికారులు వీడీసీ అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను మంగళవారం సీజ్ చేశారు.



వీడీసీ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను సీజ్ చేసిన రెవెన్యూ, జీపీ అధికారులు

కొరడా ఝుళిపిస్తున్న న్యాయ సేవా సంస్థ

వీడీసీల ఆగడాలపై జిల్లా న్యాయసేవా సంస్థ కొరడా ఝుళిపిస్తోంది. వీడీసీలు బలంగా ఉన్న తాళ్లరాంపూర్, సుర్బిర్యాల్ గ్రామాల్లోని వీడీసీల రద్దుకు గ్రామ ప్రజలు తీర్మానాలు చేసి జిల్లా న్యాయసేవా సంస్థకు పంపించారు. ఈ చర్యతో ఇతర గ్రామాల్లో వీడీసీలపై తిరుగుబాటు తప్పదని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి డి. ఉదయభాస్కర్ రావు అన్నారు. హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తేందుకు జిల్లా వ్యాప్తంగా న్యాయ విజ్ఞన సదస్సులు నిర్వహించామని, త్వరలో మరిన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని అన్నారు.

జిల్లా కేంద్రంలో దొంగల హల్‌చల్

- ఏటీఎం చోరీకి యత్నం
- ముసుగులు ధరించి మారుతి వ్యాన్‌లో వచ్చిన దుండగులు
- వెంట గ్యాస్ కట్టర్..
- పెట్రోలింగ్ వ్యాన్ రావడంతో పరార్
- పాల్దా వద్ద మారుతి వ్యాన్‌ను వదిలేసిన చోరులు

ఖలీల్‌వాడి: మారుతి వ్యాన్‌లో వచ్చిన దుండగులు ముసుగులు ధరించి.. గ్యాస్ కట్టర్‌ను ఉపయోగించి ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలకు చిక్కకుండా ముసుగులు ధరించారు. అదే సమయంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం రావడంతో వ్యాన్‌లో పరారయ్యారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్‌కాలనీ చౌరస్తాలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలో రిజిస్ట్రేషన్ అయిన మారుతి వ్యాన్‌లో వచ్చిన దండగులు ముసుగులు ధరించి ఏటీఎంలోకి ప్రవేశించారు. తమ వెంట తీసుకొచ్చిన గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేశారు. నగదు తీసేందుకు యత్నిస్తున్న సమయంలోనే పోలీసు పెట్రోలింగ్ వాహనం రావడంతో వ్యాన్‌లో పరారయ్యారు. బాసరవైపు పారిపోతుండగా అప్రమత్తమైన పెట్రోలింగ్ సిబ్బంది దుండగుల వాహనాన్ని వెంబడిస్తూనే అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించారు. తప్పించుకునే మార్గం లేకపోవడంతో నవీపేట మండలం పాల్దా వద్ద మారుతి వ్యాన్‌ను వదిలేసి పారిపోయారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని పోలీసులు ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.



ఏటీఎంను గ్యాస్‌కట్టర్‌తో తొలగించిన దృశ్యం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

ముంబై మెయిన్ బ్రాంచ్‌కు మెస్సేజ్

ఏటీఎంలో దుండగులు చోరీకి యత్నిస్తున్న సమయంలో ముంబైలోని మెయిన్ బ్రాంచ్‌కు మెస్సేజ్ వెళ్లడంతో అక్కడి సిబ్బంది నిజామాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. వెంటనే మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ వాహనం ఏటీఎం వద్దకు చేరుకోవడంతో దుండగులు పరారయ్యారు. ఏటీఎం నుంచి నగదు పోలేదని ఎస్సై హరిబాబు తెలిపారు.

ఘటనా స్థలం పరిశీలన

ఘటనాస్థలాన్ని సీపీ పోతరాజు సాయిచైతన్య పరిశీలించారు. మూడవటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీలో ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎంను సీపీ పోతరాజు సాయిచైతన్య పరిశీలించారు. ఎస్సై హరిబాబు, సీఐ శ్రీనివాస్ రాజుకు పలు సూచనలు చేశారు. కేసు విచారణ చేయాలని క్లూస్ టీం, సీసీఎస్ టీం అధికారులను ఆదేశించారు.

మళ్లీ పోటెత్తిన వరద



ఎస్సారెస్పీ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

- 40 వరద గేట్ల ఎత్తివేత

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి మంగళవారం ఉదయం నుంచి మళ్లీ వరద పోటెత్తింది. దీంతో నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు పెంచారు. సోమవారం రాత్రి ఇన్‌ఫ్లో లక్షా 17వేలకు తగ్గగా, మంగళవారం ఉదయం లక్షా 45 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 39 వరద గేట్లను ఎత్తి లక్షా 73 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి వరద పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇన్‌ఫ్లో 2.27లక్షల క్యూసెక్కులు నిలకడగా ఉన్నప్పటికీ.. అవుట్ ఫ్లోను 2.75 లక్షల క్యూసెక్కుల నుంచి 3.75లక్షలకు పెంచారు. రాత్రి వేళ ఇన్‌ఫ్లో లక్షా 75 వేల క్యూసెక్కులకు తగ్గింది. 40 గేట్ల ద్వారా 3లక్షల 12వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఇన్‌ఫ్లో - అవుట్ ఫ్లో (క్యూసెక్కులు లక్షల్లో..)

సమయం	ఇన్‌ఫ్లో	అవుట్ ఫ్లో
ఉదయం 8	2.00	2.32
10 గంటలకు	2.27	2.75
సాయంత్రం 5	2.27	3.25
6 గంటలకు	2.27	3.75
10.30 గం.లకు	1.75	3.12

వరద కాలువకు పెరిగిన నీటి విడుదల

వరద కాలువకు 20 వేల క్యూసెక్కులు, కాకతీయకు 4700, ఎస్కేప్ గేట్ల ద్వారా 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తుండగా, ఆవిరి రూపంలో 636 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రం 1088.10(70.14 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నీట మునిగిన పంటలు

- వందలాది ఎకరాల్లో సోయాకు నష్టం



మంగళవారం ఉదయం కందకుర్తి వద్ద అంతర్రాష్ట్ర వంతెన పైనుంచి ప్రవహిస్తున్న గోదావరి

బోధన్/బోధన్ రూరల్/రెంజల్/వర్ని: భారీ వర్షాలకు తోడు నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మంజీర నదిలోకి వరద పోటెత్తింది. సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్, సాలూర, బోధన్ రూరల్ మండలం హంగర్గ గ్రామాల శివారులో సోయా, వరి, పెసర, మినుము పంటలు వందలాది ఎకరాల్లో నీట మునిగాయి. పూతదశలో ఉన్న సోయాకు అపారనష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హంగర్గ గ్రామంలోని హనుమాన్ ఆలయం వరకు వరద నీరు వచ్చింది. గ్రామ శివారులోని 13 వందల ఎకరాల్లో సోయా నీట మునిగింది. వరద తగ్గిన తరువాత పంట నష్టంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మందర్నా గ్రామంలో తహసీల్దార్ శశిభూషణ్ సోమవారం రాత్రి బస చేసి వరద పరిస్థితిని పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం గ్రామస్తులతో కలిసి వరద ఉధృతిని పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ సాలూర, హంగర్గ గ్రామాలను సందర్శించి వరదను పరిశీలించారు. అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట బోధన్ రూరల్ తహసీల్దార్ విఠల్, ఏవో సంతోష్, అధికారులు ఉన్నారు. సాయంత్రం వేళ సీపీ సాయిచైతన్య హంగర్గా, ఖండ్‌గావ్ గ్రామాలను సందర్శించిన వరద ఉధృతిని పరిశీలించారు. రెంజల్ మండలం కందకుర్తి శివారులోని రాష్ట్ర సరిహద్దులో ఉన్న వంతెన పైనుంచి మంగళవారం ఉదయం గోదావరి ప్రవహించింది. రెండు రాష్ట్రాల అధికారులు, పోలీసులు వంతెనకు ఇరువైపులా పికెటింగ్ ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. సాయంత్రం వేళ వరద కాస్త తగ్గుముఖం పట్టింది. రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు నదీ పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. గ్రామాల్లో దండోరా వేయించారు.

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో వస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి నిజాంసాగర్‌లోకి 80 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో 16 గేట్ల ద్వారా 88 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1,403. 67 అడుగుల (15.902 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న జలాలు



హంగర్గ శివారులో నీట మునిగిన సోయా

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



నిజామాబాద్ నాగారం: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో రాజ్యశ్రీ అన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి రాసిన పాటను మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆమె విడుదల చేశారు. రాజశ్రీ మాట్లాడుతూ.. పాట రాసిన నాగలక్ష్మి, పాట పాడిన స్వామీ సులోచన, ఈ పాటకు నృత్యాన్ని చేసిన ఆశా కార్యకర్తలను అభినందించారు. జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్, డీఎస్‌వో నాగరాజు, ఏవో రాజేశ్వర్, ఘనపూర్ వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, వినయ్, సూర్యనారాయణ, నాగరాజు సందీప్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రయల్ రన్ సక్సెస్



నిజాంసాగర్: ఆరేడ్ గ్రామ పరిసరాల్లో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు 20 వరద గేట్లకు మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఒక్కో గేటును 5 మీటర్ల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ట్రయల్‌రన్‌ను జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఈఈ సోలోమాన్, ఏఈలు శివప్రసాద్, సాకేత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ పర్యవేక్షించారు. ఈ 20 గేట్లను ఎత్తడం 36 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. అన్ని గేట్లు సక్రమంగా లేవడంతో నీటిపారుదల శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

తరలివచ్చిన జనం..

నిజాంసాగర్ ప్రాజెక్టు 20 వరద గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రాజెక్టు అందాలను తిలకించడానికి జనం తరలివచ్చారు. ఈ గేట్లను 36 ఏళ్ల తర్వాత ఎత్తడం గమనార్హం. వేలాది మంది పర్యాటకులు తరలిరావడంతో ప్రాజెక్టు జనకళను సంతరించుకుంది.

గణేశ్ ఉత్సవాలు.. జాగ్రత్తలు తప్పనిసరి

- చిన్న చిన్న పొరపాట్లే ప్రాణాలు తీస్తాయి
- శోభాయాత్ర, నిమజ్జన సమయంలో మరింత అప్రమత్తత అవసరం

ఖలీల్‌వాడి: వినాయక చవితి ఉత్సవాలు మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో వినాయక మండపాల నిర్వాహకులు ఇతర ప్రాంతాల్లో గణేశుడి విగ్రహాలను కొనుగోలు చేసి ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. దీంతో అక్కడక్కడ కొన్ని అపశ్రుతులు చోటుచేసుకునే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఆర్మూర్ నుంచి సిరిసిల్లాకు కామారెడ్డి మీదుగా మంగళవారం ఉదయం ఎత్తైన విగ్రహాన్ని తరలిస్తుండగా విద్యుత్తు వైర్లు తగిలి ఓ యువకుడు తన పుట్టిన రోజునే ప్రాణాలు కోల్పోయిన ఘటన అందరినీ కలిచివేసింది. అయినా విగ్రహాలను తరలించే సమయంలో, శోభాయాత్ర ఊరేగింపులోనూ జాగ్రత్తలు తీసుకోక ప్రాణాలు పోతున్న ఘటనలు ప్రతి ఏడాది జరుగుతున్నాయి. పోలీసు, విద్యుత్, మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులు ప్రమాద నివారణ జాగ్రత్తలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్‌తో జర భద్రం..

గణేశ్ మండపాల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలకు సంబంధించి నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి. ఈ మండపాలకు తాత్కాలికంగా విద్యుత్ కనెక్షన్‌లను ఏర్పాటు చేస్తారు. నేరుగా కరెంట్ స్తంభాలకు విద్యుత్ వైర్లను వేయడంతో ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. స్థానిక లైన్‌మెన్ సహకారంతో విద్యుత్ కరెంట్ వైర్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు తావుండదు. మండపాల వద్ద కర్రలకు స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయడంతో వాటిని ముట్టుకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి డెంబర్ బోర్డులను ఏర్పాటు చేయాలి. విద్యుత్ విషయంలో నిమజ్జనం అయ్యేవరకు మండపాల నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్ ప్రమాదం, సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్–1912 లేదా స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.



కామారెడ్డి జిల్లాలో వినాయకుడి విగ్రహం తీసుకెళ్తుండగా జరిగిన విద్యుత్ ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రావణ్, డీఈ కళ్యాణ్

భారీ విగ్రహాలతో ప్రమాదాలు..

గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో యువకులు ఒకరికి పోటీగా మరొకరు భారీ గణపతులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వీటిని వాహనాలలో తీసుకువస్తున్న సమయంలో విద్యుత్ తీగలకు తగిలి కరెంట్ షాక్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా కొంతమంది ద్విచక్రవాహనాలపై గణేష్ ప్రతిమలు తీసుకువచ్చేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. గణేశ్ ప్రతిష్ఠాపన, నిమజ్జనం చేసేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించడానికి అవకాశం ఉంటుందని పోలీసులు సూచిస్తున్నారు. వినాయక నిమజ్జనం కోసం ట్రాక్టర్లు, డీసీఎంలు, ట్రాలీ ఆటోలను వినియోగిస్తుంటారు. విగ్రహాలను వాగులు, చెరువులు, కాలువలు, గోదావరి ప్రాంతంలో నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం సమయంలో భారీ విగ్రహాలను పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి తీసుకువెళ్లే సమయంలో వెదురుబొంగు కట్టెలతో విద్యుత్ తీగలను తాకకుండా చూడాలి. చెరువు నీటిలో దిగే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి.

20శాతం అధికంగా మండపాలు

జిల్లా వ్యాప్తంగా గతయేడాది కంటే అదనంగా 20 శాతం గణేశ్ ప్రతిమలను ఏర్పాటు చేస్తారని పోలీసులు భావిస్తున్నారు. వాటిపై పోలీసు శాఖ దృష్టిసారించి, మండపాల నిర్వాహకుల సమాచారం సేకరించడంతోపాటు గూగుల్ ద్వారా విగ్రహ ప్రాంతాన్ని సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పోలీసులకు వినాయక మండపాలకు సంబంధించిన నిర్వాహకులు సమాచారం తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. గణపతిని ప్రతిష్ఠించుకునే సంఘాల వారు https://policeportal. tspolice.gov.in/index.htm లింక్ ద్వారా సమాచారం అందించాలి. గణేష్ మండపాల వద్ద ఎలాంటి ఘటనలు జరిగిన డయల్–100 సమాచారం అందించాలి.

ఎస్సారెస్పీకి జన కళ



ప్రాజెక్ట్ ఆనకట్టపై పర్యాటకుల సందడి



కాలినడకన ప్రాజెక్టుపైకి ఎక్కుతున్న పర్యాటకులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు జలకళతోపాటు జనకళ సంతరించుకుంటుంది. వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ సందర్శనకు వేల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. ప్రాజెక్ట్ అందాలను, గలగల పారే గోదావరిని తిలకిస్తు అనందంగా గడుపుతున్నారు. కొందరు ఆహారాన్ని తీసుకువచ్చి సహపంక్తి భోజనాలను చేస్తు ఉల్లాసంగా గడిపారు. ఆనకట్టపై ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. ప్రాజెక్ట్ వద్ద కనీస వసతులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

వరద గేట్ల వైపు అనుమతి నిరాకరణ

- పర్యాటకుల ఆగ్రహం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల చేపట్టడంతో ప్రాజెక్ట్ సందర్శనకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. కానీ పర్యాటకులను వరద గేట్ల వైపు డ్యాంపైకి వెళ్లడానికి అధికారులు అనుమతివ్వడం లేదు. ప్రాజెక్ట్ ఆనకట్టపైకి మాత్రం అనుమతిస్తున్నారు. కొందరికి మాత్రం డ్యాంపైకి కూడ అనుమతిస్తున్నారు. అయినవారికి మాత్రం అధికారులు నిబంధనలు పెట్టడం లేదు. దీంతో ఒక్కసారిగా పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ డ్యాంగేటు వద్దకు దూసుకువచ్చారు. డ్యాంపైకి వెళ్లి తీరుతామంటూ నినాదాలు చేశారు. అధికారుల, పోలీసుల బంధువులకు ఎలా అనుమతిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్, ప్రాజెక్ట్ సిబ్బందితో తీవ్ర వాగ్వాదం చేశారు. కొందరు గేటు దూకి లోపలికి వెళ్లారు. ప్రాజెక్ట్‌పైకి మీడియాకు కూడ అనుమతివ్వడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి అందరికి సమాన న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.



డ్యాం గేటువైపు దూసుకువస్తున్న పర్యాటకులు

లక్ష్యం మేరకు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్‌పామ్ సాగు జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 3500 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యం కాగా, ఈ దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఆయన వ్యవసాయ శాఖ వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయిల్‌పామ్ సాగుపై సమావేశం నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారీగా సమీక్ష జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లాలో 5630 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు జరిగిందని, ఈ సంవత్సరం 1500 ఎకరాలలో ఆయిల్‌పామ్ గెలలు కోతకు వచ్చాయని తెలిపారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రకాల సబ్సిడీలను అందిస్తోందన్నారు. ఆయిల్‌పామ్ మొక్కలకు 90 శాతం రాయితీని ప్రభుత్వం భరిస్తుందని, రైతు కేవలం ఒక ఎకరానికి 1000 రూపాయల చొప్పున జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి, నిజామాబాద్ పేరిట డీడీ చెల్లిస్తే 50 మొక్కలు ప్రీ యూనిక్ కంపెనీ వారిచే అందిస్తామని తెలిపారు. అంతర పంటల సాగు చేపట్టే రైతులకు ఎకరానికి రూ. 4200 చొప్పున రైతు ఖాతాలో సంవత్సరానికి ఒకసారి జమ చేస్తారని వివరించారు. చిన్న, సన్నకారు, ఐదెకరాల లోపు విస్తీర్ణం ఉన్న వారికి 90 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులైతే 100 శాతం రాయితీ, 5 ఎకరాల పైబడి విస్తీర్ణంలో సాగు చేసే వారు 80 శాతం రాయితీ కింద డ్రిప్ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. ఈ విషయాలను రైతులకు వివరించి ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. డీఏవో గోవిందు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, ప్రీ యూనిక్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నేడు గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్స్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా లోగల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ (ప్రథమ సంవత్సరం)లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి బుధవారం (20న) స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు గత విద్యాసంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాలకు గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాలయాల్లో 4వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో వీటీజీసెట్ ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులకు మెరిట్ ప్రాతిపాదికన అడ్మిషన్లలో ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఏదైనా ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలలో ఇప్పటికే సీటు పొందిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్‌కు అనర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు నేడు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకుర హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్

సుభాష్‌నగర్: జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని టీజీఎన్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) మధుసూదన్ సూచించారు. నగరంలోని పవర్‌హౌజ్ కంపౌండ్‌లోగల సమావేశ మందిరంలో మంగళవారం ఎస్ఈ, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఇతర అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని సూచించారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు డిపార్ట్‌మెంట్ వాహనంలో తరలించి త్వరితగతిన సమయంలో అమర్చాలని ఆదేశించారు. వినాయక చవితి, దుర్గామాత పండుగల నేపథ్యంలో విగ్రహాల తరలింపు, ఊరేగింపులో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్నిరకాల చర్యలు చేపట్టాలన్నారు. చీఫ్ ఇంజనీర్ (వరంగల్) అశోక్, ఎస్ఈ రాపల్లి రవీందర్, డీఈలు రమేష్, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలి

సుభాష్‌నగర్: విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రాపల్లి రవీందర్ ఆదేశించారు. సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం నగరంలోని రాజరాజేంద్ర చౌరస్తా, తదితర ప్రాంతాల్లో కేబుల్ వైర్లను తొలగించారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. గతేడాది నుంచి విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని ఆపరేటర్లకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. దీని ద్వారా విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, కేబుల్ వైర్లను రీఅలైన్‌మెంట్ చేసుకోవాలని ఆదేశించారు. లేకుంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా వినాయక, దుర్గామాతా విగ్రహాల తరలింపు, ఊరేగింపు సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అంతకుముందు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాద ఘటనను ఉదహరించారు. వినాయక, దుర్గామాత మండపాల నిర్వాహకులతో మాట్లాడి విద్యుత్ పట్ల జాగ్రత్త వహించేలా అవగాహన కల్పించాలని తెలిపారు.



రాజరాజేంద్ర చౌరస్తాలో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు తొలగిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

క్యాంపస్ కబుర్లు

బీఈడీ పరీక్షల్లో ఒకరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులతో పాటు బీఈడీ, బీపీఎడ్ పరీక్షల్లో మంగళవారం ఒకరు డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ పరిధిలో ఏర్పాటు చేసిన 7 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన పీజీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 1,801 మంది విద్యార్థులకు గానూ 1,132 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన బీఈడీ, బీపీఎడ్ పరీక్షలకు 1,447 మంది విద్యార్థులకు గానూ 1,402 మంది హాజరైనట్లు వివరించారు. ఆర్మూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ పరీక్ష కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ బీఈడీ మొదటి సెమిస్టర్ విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు.

మానవాళి మనుగడకు చెట్లు అత్యంత ఆవశ్యకం



తెయూ(డిచ్‌పల్లి): మానవాళి మనుగడకు చెట్ల పెంపకం అత్యంత ఆవశ్యకమని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు. తెయూ ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్–1, యూనిట్ –4 సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన సైన్స్ కళాశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా హాజరై, మొక్కలు నాటారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించి ప్రకృతిని రక్షించాలని సూచించారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, కామర్స్ డీన్ రాంబాబు, పీఆర్వో పున్నయ్య, యూజీసీ డైరెక్టర్ ఆంజనేయులు, అడ్మిషన్స్ డైరెక్టర్ వాసం చంద్రశేఖర్, అధ్యాపకులు నందిని, అతీక్ సుల్తాన్ ఘోరి, మొహమ్మద్ అబ్దుల్ ఖవి, లావణ్య, ప్రసన్నరాణి పాల్గొన్నారు.

గోల్డి బల్బీర్ కౌర్‌కు పీహెచ్‌డీ పట్టా



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో పరిశోధక విద్యార్థిని, కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గోల్డి బల్బీర్ కౌర్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వి శ్రీనివాస్ పర్యవేక్షణలో 'ద ఇమేజ్ ఆఫ్ న్యూ ఉమెన్ స్టడీ ఆఫ్ శోభాడే- సెలెక్ట్ నావెల్స్' అనే అంశంపై బల్బీర్ కౌర్ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. మంగళవారం నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) ప్రొఫెసర్ జి తిరుపతి కుమార్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. పరిశోధకురాలిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ లావణ్య, ఆంగ్ల విభాగాధిపతి కేవీరమణాచారి, బీవోస్ చైర్మన్ పి సమత, అధ్యాపకులు జోత్స్న, ఎన్‌స్వామిరావు, పాల్గొన్నారు. బల్బీర్ కౌర్ కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందినవారు. ప్రస్తుతం ఆమె మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

డాక్టరేట్ ప్రదానం



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సీహెచ్ రామచందర్‌కు మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 84వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. రాజకీయ నాయకుల దృక్పథాలు అనే అంశంపై ప్రొఫెసర్ చెల్లమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయన పరిశోధన చేశారు. ముఖ్యంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో రాజకీయాలు, రాజకీయ నాయకుల విధివిధానాల అనే అంశంపై పరిశోధన చేశారు. ఈసందర్భంగా డాక్టరేట్ పట్టాను పొందిన రామచందర్‌ను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

బోధన్‌లో కలకలం రేపిన రేసింగ్ పావురం



బోధన్‌రూరల్ : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో కోడింగ్ స్టిక్కర్‌తో ఉన్న పావురం కలకలం రేపింది. మండలంలోని భవానీపేట్ గ్రామంలో ఓ బాలుడు ఆడుకుంటుండగా పావురం దొరికింది. ఆ పావురం కాలికి, రెక్కలకు కోడింగ్ నెంబర్‌లతో ఉన్న స్టిక్కర్‌లు ఉన్నాయి. దీంతో ఆ పావురం గూఢచారి పావురం అంటూ ప్రచారం జరిగింది. గ్రామస్తులు కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి అక్కడికి చేరుకుని పావురాన్ని స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్ తీసుకొచ్చారు. ఈ పావురం రేసింగ్ గేమ్‌కు సంబంధించినదని ఎస్సై తెలిపారు. పావురాన్ని పరిశీలించి వదిలేసినట్లు చెప్పారు. ఎటువంటి కేసు నమోదు చెయ్యలేదన్నారు. ఈ పావురం ఘటన మంగళవారం సోషల్ మీడియా వైరల్‌గా మారింది.

బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ ప్రాంతీయ (కామారెడ్డి, నిజామాబాద్) సైనిక సంక్షేమ జిల్లా అధికారిగా మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇన్‌చార్జిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ బాధ్యతల స్వీకరించి విషయం తెలిసిందే. గత నెల 31న ఆయన పదవీ విరమణ చేయడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు.

క్రైం కార్నర్

సైబర్‌క్రైమ్‌లో డబ్బుల రిఫండ్

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురై, డబ్బులు పోగొట్టుకోగా పోలీసులు రికవరీ చేశారు. కోటగిరి ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు ఇలా.. కోటగిరి గ్రామానికి చెందిన ఎజాస్ అహ్మద్ ఖురేషి అనే వ్యక్తి వాట్సప్‌కు 13 ఏప్రిల్ 2025 నాడు అనుమానాస్పద లింక్ మెసేజ్ రాగా ఓపెన్ చేశాడు. దీంతో సైబర్ నేరగాళ్లు అతని బ్యాంక్ అకౌంట్ నుంచి కొన్ని డబ్బులు దోచేశారు. వెంటనే బాధితుడు కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా, వారు సైబర్ క్రైమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి బాధితుడికి రూ.5వేలు రిఫండ్ చేయించారు.

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

నిజామాబాద్ లీగల్/కామారెడ్డి క్రైం: ఆభరణాల కోసం ఓ వృద్ధురాలిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలాలా.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన గుడిలింగం పండరి అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. సులువుగా డబ్బు సంపాదన కోసం దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈక్రమంలో గ్రామంలోని గోనె కాశవ్వ (58) అనే వృద్ధురాలి ఆభరణాలను దొంగిలించాలనుకున్నాడు. 29 సెప్టెంబర్, 2024న కాశవ్వ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమె తలపై రోకలి దుడ్డుతో కొట్టి హత్యచేసి, ఆమె మెడలో ఉన్న గుండ్లు, చెవులకు ఉన్న నగలను దొంగిలించాడు. మృతురాలి కుమారుడు బాబయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. నిందితుడు లింగంను అప్పట్లోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన నిజామాబాద్ రెండవ అదనపు జిల్లా సెషన్స్ (ఎస్సీ, ఎస్టీ) కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ నిందితుడికి హత్యా నేరానికి గాను జీవిత ఖైదు, దొంగతనం నేరానికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఎస్సీ మహిళను చంపినందుకు మరో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామంలో సుంకెట విజయకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు తహసీల్దార్ రవీందర్‌రావు మంగళవారం తెలిపారు. అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, బట్టలు, టీవీ, ఫ్రిజ్, సెల్‌ఫోన్లు, బియ్యం, నగదు, బంగారు ఆభరణాలు పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.4లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని సారంగపూర్‌లోని పెట్రోల్ బంక్ వద్ద గంజాయిని ఆటోలో తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్వప్న తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని సారంగపూర్‌కు చెందిన సయ్యద్ వాసీం చిన్న ప్యాకెట్లను ఏర్పాటు చేసుకొని గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిపారు. పక్కా సమాచారం మేరకు సారంగపూర్ పెట్రోల్ బంక్ వద్ద ఆటోను ఆపి తనిఖీలు నిర్వహించగా వాసీం వద్ద 100 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడి సెల్‌ఫోన్‌ను, ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిబ్బంది రామ్‌కుమార్, హమీద్, విష్ణు, అవినాష్, భోజన్న ఉన్నారు.

ఖైదీలకు టీబీ వ్యాధిపై అవగాహన

నిజామాబాద్ లీగల్: సారంగాపూర్‌లోని సెంట్రల్ జైలులో మంగళవారం టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా ఖైదీలకు టీబీ వ్యాధిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో రాజశ్రీ, జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ దేవి నాగేశ్వరి, మెడికల్ ఆఫీసర్ అవంతి ఖైదీలకు పలు జాగ్రత్తలను వివరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జైలులోని 560 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం, జైలర్ రాజశేఖర్, జైల్ మెడికల్ ఆఫీసర్ దినేష్, జిల్లా టీబీ కో–ఆర్డినేటర్లు రవిగౌడ్, లక్ష్మణ్, స్వాతి, మహేష్, రాంచందర్, స్రవంతి, సాయికిరణ్, శివ, ఖలీద్, శంకర్ రాథోడ్ పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

పెర్కిట్(ఆర్మూర్): వానకాల సీజన్‌కు ఎరువుల కొరత లేదని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. ఆలూర్ మండల కేంద్రంలోని సొసైటీ గోదామును డీసీవో మంగళవారం తనిఖీ చేశారు. గోదాములో ఎరువుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వానకాల సీజన్‌లో రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తగినంత యూరియా అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అలాగే రైతులు తమ అవసరాలకు అనుగుణంగా యూరియాను తీసుకోవాలని సూచించారు. సొసైటీ వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, సెక్రెటరీ మల్లేష్, సిబ్బంది ముత్యం, సురేష్, సీత గంగారాం, రైతులు పాల్గొన్నారు.



ఆలూర్ సొసైటీ గోదాంలో రికార్డులను పరిశీలిస్తున్న డీసీవో శ్రీనివాస్‌రావు

వాలీబాల్ టోర్నీ విజేత జిల్లా బాలికల జట్టు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–15 బాలుర, బాలికల వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానం నిజామాబాద్, ద్వితీయ స్థానం సూర్యాపేట, తృతీయ స్థానం నారాయణ్‌పేట జిల్లాలు దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం ప్రథమ స్థానంలో, రంగారెడ్డి ద్వితీయ స్థానంలో, మంచిర్యాల తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు షీల్డ్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు.

జల్సాలకు అలవాటు పడి బైక్‌ల చోరీలు

- ఇద్దరు నిందితుల పట్టివేత.. ఒకరి పరారి
- ఎనిమిది బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్సై గంగాధర్

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటు పడి బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు ఇలా.. జగిత్యాల జిల్లా రహ్మత్‌పురాకు చెందిన సయ్యద్ యూనూస్ ఈ నెల 17న నిజామాబాద్‌కు బైక్‌పై పని నిమిత్తం వచ్చాడు. వర్నిచౌరస్తాలోని ఓ హోటల్ వద్ద నిలిపిన తన బైక్ చోరీ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాబాన్ సాహెబ్‌పహాడ్ వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా బోధన్‌లోని అనీసానగర్‌కు చెందిన షేక్ ఇలియాస్, షేక్ సమీర్ బైక్‌పై అనుమానస్పదంగా తిరగడంతో పట్టుకొని విచారించగా బైక్‌లు దొంగతనం చేసినట్లు తెలిపారు. షేక్ రియాజ్ అలియాస్ అరబ్ ఆలియాస్ అర్షద్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. వారి నుంచి ఎనిమిది బైక్‌లను రికవరీ చేసినట్లు తెలిపారు. నిర్మల్, మహారాష్ట్రతో పాటు పలు ప్రాంతాల్లో బైక్‌లు దొంగతనం చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్సై గంగాధర్, సీసీఎస్ సీఐ సురేష్, నార్త్ సీఐ బూస శ్రీనివాస్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి అభినందించారు.